ప్రజాశక్తి
ఆదివారం 19 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

పరుగు పందెం విజేత సింహాద్రికి ఘన సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ఇటీవల జరిగిన ఇండో, నేపాల్ యూత్ గేమ్స్‌లో ఐదు కిలోమీటర్ల మారథన్ పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన మండలంలోని కంబవలస గ్రామానికి చెందిన కోనేపు సింహాద్రిని శనివారం జనసేన పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఐటిడిఏ ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహించి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పథకాలు సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి కొములు, ఆ పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి బి రామదాసు, కే లక్ష్మణరావు ,ఆనంద్‌రావు, పి.సురేష్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

మరమ్మతుకు నోచని సోలార్ పైపులైన్

- తాగునీటి సమస్యతో గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి-అనంతగిరి:తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం బెడ్డగుడ గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ తాగునీటి పథకం మరమ్మతు గురి కావడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి లక్ష్మీపురం బెడ్డగూడ గ్రామంలో తాగునీటి సమస్య నివారించేందుకు 2017- 18 సంవత్సరంలో ప్రభుత్వం మోటార్ కనక్షన్ ద్వారా సోలార్ పంప్ పథకం ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో పిడుగులతో కూడిన భారీ వర్షాల కారణంగా సోలార్ పథకం పాడై గత రెండు నెలలు కావస్తోంది. దీంతో గత్యంతరం లేక ఆ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పైపులైన్ గొట్టంలో వచ్చే నీరుని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామంలో ఉన్న సోలార్ పథకం పాడైందని, తక్షణమే మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరా చేయాలని గ్రామస్తులు సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. పాడైన సోలార్ పథకాన్ని సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిపక్షాన మండల కేంద్రంలో ఆందోళన చేపడతామని ఎస్.భీమన, రాజు, విజయ్, జోగారావు, పోతురాజు తెలిపారు.

నీటిని మోసుకెళుతున్న మహిళలు

మరమ్మతుకు గురైన సోలార్ తాగునీటి పథకం

మారథాన్‌లో..

శారద నికేతన్ విద్యార్థికి బంగారు పతకం

- అభినందించిన సురేంద్ర, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:విశాఖపట్నం గీతం కళాశాలలో ఈ నెల 12 న నిర్వహించిన విశాఖ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మారథాన్ 10 కిలో మీటర్ల పరుగు పందెంలో అరకులోయ మండలం శారద నికేతన్ పాఠశాల విద్యార్థిని కొర్ర జీవనతన్య సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకుని మొదటి స్థానం నిలిచింది. విద్యార్థిని అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ లిట్టిగూడ గ్రామానికి చెందిన సాధారణ నిరుపేద కుటుంబానికి చెందిన కొర్ర జీవనతన్య అరకులోయ మండలం శారద నికేతన్ పాఠశాలలో మూడోవ తరగతి చదువు కుంటుంది. ఈ నెల 12 జరిగిన మారథాన్ 10 కిలో మీటర్ల పరుగుల పందెంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. గతంలో అరకు ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 5 కిలో మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిలోమీటర్ల లో కూడా మొదటి స్థానం కైవసం చేసుకుంది. యూత్ పెస్ట్ మారథాన్ లో రెండోవ స్థానం కైవసం చేసుకుంది. శారద నికేతన్ పాఠశాలలో శనివారం స్కూల్ కమిటి, సిబ్బంది, ప్రిన్సిపాల్ చిరంజీవులు సన్మానించారు.ఈ సందర్భంగా స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, మారథాన్ పరుగులు పందెంలో 8 ఏళ్ల చిన్నారి పట్టుదల సాహసంతో బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. మరెన్నో పతకాలు కైవసం చేసుకోవాలని ఆకాక్షించారు. పాఠశాల అభివృధి కమిటి సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, పది కిలో మీటర్ల పరుగుల పందెంలో అతిచిన్న వయసులో విజయం సాధించడం గర్వకారణం అన్నారు.క్రమ శిక్షణ పట్టుధలతో కట్టుబడి చదువుకుంటే మంచి భవిష్యత్ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి కొర్ర బాబురావు, పాఠశాల సిబ్బంది కృష్ణ కుమారి, విజయ్, నాగలక్ష్మి, నాగమణి, కుమారి, కరిష్మా, సంధ్య, పి ఈ టి ఎస్ మహేష్, సాయి, జగన్నాథం విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన తన్యను సన్మానిస్తున్న సురేంద్ర, ఉపాధ్యాయులు

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డీడీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగూడ గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని పాడేరు డిడి పరిమళ శనివారం సందర్శించి పరిశీలించారు. విద్యార్థులు ఉండే వసతి గదులను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న మరుగుదొడ్లను విద్యార్థులు ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి, బోజన మెనూను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెను చార్ట్ ప్రకారం ప్రతిరోజు మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యక్యమైన విద్యను అందించాలని చెప్పారు. మెనూ అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పదని ఆమె హెచ్చరించారు. ఆయన వెంట ఎటిడబ్ల్యూఒ రమణ ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీడీ పరిమళ

పరిశీలిస్తున్న ఎంపిడిఒ

అస్తవ్యస్త రోడ్డును పరిశీలించిన ఎంపిడిఒ

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని కించాయిపుట్టు గ్రామ పంచాయతీ దారపల్లి గ్రామ సమీపంలోని కుంగిన కల్వర్టు, అదే మార్గంలోని అస్తవ్యస్త రోడ్డును ఎంపిడిఒ ధర్మారావు పరిశీలించారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 11న కుంగిన కల్వర్టు అనే కథనం ప్రచురితం కావడం, గత గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్, సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు ఈ సమస్యపై ఎంపీడీవోకు వినతిని సమర్పించారు. ఈ వినతి కి స్పందిస్తూ శనివారం ఎంపిడిఒ దారపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు, బీటి రోడ్డు ను నేరుగా వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కల్వర్టు మరమ్మతుకు ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. రోడ్డు మరమ్మత్తులు చేసేందుకు సచివాలయ సెక్రెటరీ సింహాచలం బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

ప్రజాశక్తి-ముంచిగిపుట్టు:మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వారపు సంతలో మైదాన, ఒరిస్సా ప్రాంతవాసులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తుండగా స్థానిక పంచాయతీ సెక్రెటరీ సింహాచలం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ మాట్లాడుతూ, ఏఓబి సరిహద్దు ప్రాంతం కావడంతో ఒరిస్సా, రాష్ట్ర వాసులు, మైదాన ప్రాంతవాసులు వారపు సంతల్లో ప్లాస్టిక్ కవర్లను విక్రయించడం గమనించి పట్టుకొని ఎంపీడీవో కార్యాలయంకు తరలించామన్నారు. ప్లాస్టిక్ సంచలతో పాటు, ఒరిస్సా రాష్ట్రంలో తయారుచేసే నాసిరకమైన నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నారని తెలిపారు. నాసిరకమైన వస్తువులు ప్రజలు కొనుగోలు చేసి అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు.

స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

కోటి సంతకాల సేకరణ దేనికి..?

- రాష్ట్ర కనీస వేతనాల సంఘం సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: వైసిపి పార్టీ కోటి సంతకాల సేకరణ దేనికోసమని రాష్ట్ర కనీస వేతనాల సంఘం సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ టి సుబ్బారావు వైసిపి నాయకులకు సూటిగా ప్రశ్నించారు. మండల కేంద్రంలోని అల్లూరి సామాజిక భవనంలో ఆ పార్టీ నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 16నెలల కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తుంటే చూస్తు ఓర్వలేక కోటి సంతకాల సేకరణ చేపడుతుండడం సిగ్గుచేటుగా ఉందన్నారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించిన వైకాపా కూటమి ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేని వైకాపా ఇప్పటికైన విమర్శలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఎంపీటీసీ సభ్యురాలు గీత, మాజీ ఎంపీపీ దన్నెరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు బీమరాజు, సింహాద్రి, సీతన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతలు

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

అడ్డతీగల-ప్రజాశక్తి: పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ తెలిపారు. మండల కేంద్రం వేటమామిడిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో కొన్ని గ్రామాలు పర్యాటక ప్రాంతాలకు అనువుగా ఉన్నాయని వీటిలో కొన్నిటిని ఎంపిక చేసి వాటి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ , డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు పిఒ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి సంబంధిత అధికారులతో సంప్రదించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట తహశీల్దార్లు దొరకయ్య, ఎంపిడిఒ కుమార్,అడ్డతీగల మండల పరిషత్ అధ్యక్షులు రాఘవ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఎర్రపుదొర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఒ స్మరణ్‌రాజ్

పోలవరం సమస్యలపై మంత్రి 'నిమ్మల'కు వినతి

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలం లోని రాజుపేటకాలనీ గ్రామానికి చెందిన పోలవరం ముంపు నిర్వాసితులు శనివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పోలవరం ప్రాజెక్ట్ వలన మా గ్రామాలలో సుమారుగా 1000 గిరిజనేతర పిడిఎఫ్ కుటుంబాలు ఉన్నాయనీ వారంతా వ్యవసాయ ఆధారిత కూలీలే అని గతంలో తాడువాయిలో స్థలాలు చూపించి ఉన్నారని అయితే అక్కడ వ్యవసాయం అనుకూలంగా లేదని మేము కోరుకున్న చోట ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం ముష్టి కుంట, కంభంపాడు, వామనకుంట, తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం పరిసర ప్రాంతాల్లో అనుకూలంగా ఉంటుందని అక్కడ స్థలం ఇప్పించాలని పలు సమస్యలను విన్నవించారు. ఈ క్రింది సమస్యలు పరిష్కరించాలని ఆయనను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు.

వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

గిరిజనేతరుల భూములు లీజుపై

విచారణ జరపాలి

ప్రజాశక్తి-కూనవరం: పోలవరం ప్రాజెక్టు భూ నష్టపరిహారం తీసుకున్న గ్రామంలో లేని గిరిజనేతరుల భూస్వాముల భూములు గిరిజనులకు పంచాలని గతం నుండి గిరిజనులు, గిరిజన సంఘం అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. చింతూరులో ఐటిడిఎకి జిల్లా కలెక్టర్ వచ్చిన సందర్భంగా గిరిజన సంఘ నాయకులు పోలవరం భూ నష్టపరిహారం పొందిన గిరిజనేతరుల భూస్వాములు భూములు విషయమై సంఘ నాయకులు అడిగిన పిమ్మట ఎవరైనా గిరిజనేతరులు భూములు లీజుకు ఇస్తే విచారణ జరిపికఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అయితే ఇప్పటివరకు స్థానిక అధికారులు విచారణ చేయలేదని ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతి పత్రం అందించామ న్నారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేదంటే ఆదివాసీ గిరిజన సంఘం తరపున భూ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు బాబు బోర్రయ్య, పాయం సీతారామయ్య తెల్లం తమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో శనివారం భారీ వర్షం కురిసింది. ఎపి జెన్‌కో కాలనీలో ఎగువ నుంచి నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుకుంది. డ్రైనేజీలో చెత్త అడ్డురావడంతో రహదారిపైకి చెత్త కొట్టుకొచ్చింది. వరి పంటకు ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

హెల్త్ వాలంటీర్లను వెంటనే నియమించాలి

ప్రజాశక్తి -మారేడుమిల్లి : స్థానిక ఐటిడిఎ పరిధిలో ప్రతి ఆశ్రమ స్కూల్, వసతిగృహాల్లో ఆరోగ్య సిబ్బంది, హెల్త్ వాలంటీర్లను వెంటనే నియమించాలని ఆదివాసీ జెఎసి ఆరోగ్య కార్యాకర్తల అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, మిర్తివాడ వీరవేణి డిమాండ్ చేశారు. మారేడుమిల్లి గిరిజన గురుకుల పాఠశాలలోనూ, నియోజకవర్గ పరిధిలో సుమారుగా ఆరుగురు విద్యార్థులు మృతి చెందారని, పదుల కొద్దీ సంఖ్యలో మంచానికి పరిమితమై ఉన్నారని, వెంటనే హెల్త్ వాలంటీర్లు ను నియమించాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ గంగులయ్యను సన్మానిస్తున్న మండల కోర్‌కమిటీ నాయకులు

28 నుండి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -కొయ్యూరు: ఈ నెల 28 నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని జనసేన పార్టీ ఇంచార్జి, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమి చైర్మన్ డాక్టర్ గంగులయ్య తెలిపారు. పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో కొయ్యూరు మండల కోర్ కమిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. కొయ్యూరు మండల కోర్ కమిటీ నాయకులు చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికలకు పోటీ పడుతున్న అభ్యర్థులు, స్థానిక రాజకీయ సమీకరణాలు పరిశీలించి తుది నివేదిక తమకు అందించాలని పోటీ చేసే అభ్యర్థులు కచ్చితంగా క్రియాశీలక సభ్యత్వం పొంది ఉండాలని చైర్మన్ డాక్టర్ గంగులయ్య కోర్ కమిటీ నాయకులకు సూచించారు.కొయ్యూరు కోర్ కమిటీ నాయకులు తుది నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, గూడెం. లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు బుజ్జి బాబు, మండల ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు, పాల్గొన్నారు.

చెకుముకి టెస్టుకు విశేష స్పందన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా విద్యార్థులకు శనివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎనిమిది తొమ్మిది, పదో తరగతుల విద్యార్థులకు జ్ఞన విజ్ఞాన వేదిక అల్లూరి జిల్లా అధ్యక్షులు తీగల బొజ్జియ్య అధ్యక్షతన ఈ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జియ్య మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్‌లో 61 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో, చింతూరు డివిజన్లో 26 పాఠశాలల్లో టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో విజేతలను 1 నవంబర్ 2025న మండలస్థాయిలో జరిగే టెస్ట్‌కు అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ కెవివి సత్యనారాయణదొర, రంపచోడవరం ఎంఇఒ- 1 లక్ష్మీ శ్రీనివాస్,గర్ల్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ కవిత, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, అలాగే జిల్లా కార్యదర్శులు కారం సూరిబాబు, ఆదిరెడ్డి యూటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై విల్సన్‌బాబు, యుటిఎఫ్ నాయకులు దూడ మహేష్, సనాతన బాబు, కుంజం శ్రీనివాస్ పాల్గొన్నారు. జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి కన్నారావు గౌరవ అధ్యక్షులు విశ్వరాజ్, కోశాధికారి వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

పర్యవేక్షిస్తున్న ఎంఇఒ సత్యనారాయణదొర తదితరులు

ఇ - పంట నమోదుకు గడువు 25

ప్రజాశక్తి- చింతూరు: మండలంలో 94 శాతం ఇ పంట నమోదు చేయబడిందని వ్యవసాయాధికారి రత్నప్రభ శనివారం తెలిపారు. వరి 11,894 ఎకరాలు పత్తి 523ఎకరాలు నమోదైందని ఇంకా ఎవరైనా రైతులు నమోదు చేసుకోకపోతే వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్, పట్టాదారు పుస్తకం నఖలు సమర్పించి నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ సంవత్సరం పంటతో పాటు పంట వేయని భూమిని (ఫాలో ల్యాండ్స్) కూడా నమోదు చేస్తున్నారన్నారు. కావున రైతులందరూ సహకరించాలని కల్లేరు చింతూరు పరిధిలో ఎర్రంపేట వేగితోటలో పంట రికార్డులను సూపర్ చెక్ కింద తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇ పంట నమోదుకు చివరి తేదీ అక్టోబర్ 25 అని, రైతులందరూ తప్పని సరిగా పంట నమోదుకు సహకరించాలన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కొయ్యూరు: టిడిపి నాయకుడు ఎం.వి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో శనివారం సిసి రోడ్డు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజేంద్రపాలెంలో 200లు మీటర్లు సిసి రోడ్డునకు రూ.5లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీట సింహాచలం, ఎంపిటిసి నూకాలమ్మ , టిడిపి నేతలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -సీలేరు: గూడెంకొత్తవీధి మండలం గాలి కొండ పంచాయతీ పరిధిలో సప్పర్ల నుంచి సువ్వాపల్లి వరకూ రూ.4.40 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించబోయే రహదారికి మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మారుమూల మండలమైన గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలో సప్పర్లరోడ్డు నుంచి మారుమూల సువ్వాపల్లి వరకూ నాలుగు కిలోమీటర్లు రహదారి నిర్మించడానికి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఈ మేరకు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బోయిన కుమారి, వైస్ ఎంపిపి ఆనంద్, మాజీ జెడ్‌పిటిసి నళిని, మాజీ ఎంపిటిసి పోతురాజు గోవింద్, నాయకులు కృష్ణ, వెంకటేష్, చిన్నారావు, నాగబాబు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

300 ఆర్‌డిఎస్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: మండలంలోని డి.గొందూరు, రాయిబుపుట్టు గ్రామాల్లో రైతుల కోసం 300 ఆర్‌డిఎస్ (రబీ డ్రై సోయింగ్) సీడ్ కిట్లను రైతు సాధికార సంస్థ పంపిణీ చేసింది. రైతు సాధికార సంస్థ గౌరవ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.జె.వి రామ్మోహనరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆర్‌డిఎస్ విధానం ద్వారా భూమి సత్తువ మెరుగు పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే పంటలు మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ముఖ్యంగా, బహుళ పంటల సాగు (మల్టీ-క్రాపింగ్) ఆవశ్యకతను వివరించారు. ఈ పద్ధతిని అనుసరిస్తే రైతులకు ఏడాది పొడవునా నిరంతర ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వయంగా రైతులకు ఆర్‌డిఎస్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు సమాఖ్య సభ్యులు, వి.ఓ. (విలేజ్ ఆర్గనైజేషన్) ప్రతినిధులు, (ట్రాన్స్‌ఫర్మేషన్ ఎన్‌ఎఫ్‌ఎ కె.బాబాజీ, రైతు సాధికార సంస్థ - ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షునిగా రాము

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ దండబడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పెట్టెలి రాముని అరకులోయ పిఎసిఎస్ అధ్యక్షుడిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో ఆయన రెండుసార్లు టీడీపీ మండల అధ్యక్షుడిగా, సుంకరమెట్ట సర్పంచ్‌గా గాలికొండ వన సంరక్షణ సమితి అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం పిఎసిఎస్ అధ్యక్షుడుగా నియమితులయ్యారు. గతంలో నుండి టీడీపీ పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారు.

దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు

ఘనంగా దీపావళి పండగ

ప్రజాశక్తి -జిమాడుగుల :మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తుగా దీపావళి పండగ ఘనంగా చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు దీపాలను వెలిగించి దీపావళి పండుగను నిర్వహించారు.

అదాని సిమెంట్‌ను అడ్డుకుంటాం

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను పోరాటాల ద్వారా అడ్డుకుంటామని అదాని అంబుజా సిమెంట్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ స్పష్టంచేసింది. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో శనివారం పోరాట కమిటీ సమావేశం నిర్వహించారు. అదాని అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను వ్యతిరేకిస్తూ ముద్రించిన కరపత్రాలను ఈ సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ, కాలుష్యం వెదజల్లే ఈ పరిశ్రమల వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ కన్వీనర్ ఎన్.రామారావు, కొవిరెడ్డి సత్యనారాయణ, జి.అచ్చిబాబు, నాయకులు కెఎం.శ్రీనివాస్, జి.ఆనంద్, నమ్మి రమణ, బొంతు అప్పారావు, ఎం.రాంబాబు, డి.వెంకట్రావు పాల్గొన్నారు.

డ్రోన్లతో విత్తనాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక మిషన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ల ద్వారా సౌమ్య గిరిపై సుమారు రెండు కిలోల కానుగ, కుంకుడు విత్తనాలను చల్లే కార్యక్రమాన్ని జివిఎంసి అడిషనల్ కమిషనర్ రమణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడేళ్లుగా సౌమ్య గిరిపై విత్తనాలు వేసి ఆ ప్రాంతం పచ్చగా మారడానికి మిషన్ గ్రీన్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

పాత్రికేయులపై కక్ష సాధింపు తగదు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్:ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ నిరంతరం పత్రికలో ప్రచురిస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర విలేకరులపై అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దీన్ని ఖండిస్తూ శనివారం అరకులోయ మండల కేంద్రంలోని తహశీల్దార్ కూడా మత్స్యకారులకు పాత్రికేయుల వినతిపత్రం పాత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సాక్షి దినపత్రికపై కక్ష సాధింపు మానుకోవాలన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరకులోయ సాక్షి విలేకరి సోనాయి సోమేశ్వరరావు, విజన్ రిపోర్టర్ రామచందర్,వి డేవిడ్, సంతోష్, రమను, బి.భీమన్న, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు :సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ శనివారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంఘ సభ్యులు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కె భాస్కరరావు, స్థానిక వీఆర్వో సిహెచ్ రమేష్ కుమార్ లకు వినతి పత్రాన్ని సమర్పించారు. పాత్రికేయ మండల కార్యదర్శి ఆర్ నాగభూషణం మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం పాత్రికేయుల స్వేచ్ఛను అనగదొక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయుల మండల అధ్యక్షులు బి శ్రీను, కోశాధికారి కోటి బాబు, సంఘ సభ్యులు ఎస్ సురేష్, శంకర్రావు, పాంగి పులి రాజు పాల్గొన్నారు.

అరకులోయలో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పాత్రికేయులు

సమస్యల పరిష్కారానికి కృషి

సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్ రాజ్‌కుమార్

ప్రజాశక్తి-జి.మాడుగుల: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రాజ్ కుమార్ తెలిపారు. మండలంలోని వంజరి, గెమ్మెలి పంచాయతీలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ శనివారం పర్యటన చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరడంతో శనివారం క్షేత్రస్థాయి పర్యటన చేసి నేరుగా తెలుసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపుకై పోవడంతో నేరుగా రైతులతో మాట్లాడారు. అనంతరం జాతీయ రహదారి అధికారులతో మాట్లాడారు. నష్ట పరిహారం కొద్ది రోజుల్లోనే ఖాతాల్లో జమ అవుతుందని రైతులతో తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే జి.మాడుగుల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజుల్లోనే విచారణ జరిపి తగు న్యాయం చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి పాడేరు, :జీఎస్టీ రేట్ల తగ్గింపుతో మధ్యతరగతికి భారీ ఊరట అని ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీ పూజ అన్నారు.వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సంస్కరణకు అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. ఈ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించే బాధ్యత వ్యాపారులపై ఉందని స్పష్టం చేశారు. పాత, కొత్త ధరల్లోని వ్యత్యాసాన్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని, ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులో ఉంచడం జరిగిందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆమె జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్ను దొర, ట్రైకార్ డైరెక్టర్ కె. కృష్ణారావు, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, వాణిజ్య పన్నుల శాఖ ఉప కమిషనర్ ఆర్. పద్మజ, ఇన్‌ఛార్జ్ ఆర్డీవో ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి.బి.కె. పరిమళ, లీడ్ బ్యాంకు మేనేజర్ ముత్తు నాయుడు, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్లు రమేష్ కుమార్, నూకరాజు, అచ్చయ్య పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో కొత్తపల్లి జలపాతాన్ని పాడేరు డి.ఎస్.పి అహ్మద్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని సూచించారు. పర్యాటక ముసుగులో గంజాయిని తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట జిమాడుగుల ఎస్ఐ షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పలుచోట్ల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద స్థానిక ఎస్సై రామకృష్ణ శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేశారు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలలో 45.470 కిలోల గంజాయిని, నలుగురు వ్యక్తులు తరలిస్తూ పట్టుబడ్డారని ఎస్సై రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కంటెరి జలంధర్, దామ హంటల్, పటికర, గెను హంటల్ లుగా గుర్తించారు. వీరి నుండి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ లక్ష్మణ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్ వద్ద శనివారం ఆటోలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అదుపులో తీసుకొని వారి వద్ద నుండి 25 కిలోల గంజాయి ఆటోను, మూడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని స్థానిక ఎస్సైకి పాపి నాయుడు తెలిపారు. పట్టుబడిన వారిలో ఒకరు ఒరిస్సా రాష్ట్రానికి చెందినవారు కాగా ఇద్దరు ముంచింగ్‌పుట్టు మండలానికి చెందినవారు ఉన్నారన్నారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన వ్యాన్

అదుపు తప్పిన వ్యాన్

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని వేంగడ పంచాయతీ మెట్టువలస పాపికొండల ఘాట్ రోడ్డు వద్ద వ్యాన్ బ్రేక్ ఫెయిల్ తప్పిన పెను ప్రమాదం తప్పింది. శనివారం ఎస్.కోట నుండి వేంగడ ప్రాంతంలో గృహ నిర్మాణ సామగ్రి రవాణా చేసి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మెట్టువలస మలుపు ఘట్ రోడ్డు లోయ దిగుతున్న క్రమంలో మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మలుపు నుండి ముందుకు వెళ్లిన లారీ ముందుభాగంలో ఉన్న బండరాయిని ఢీ కొంది. డ్రైవర్, క్లీనర్‌లు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారని స్థానికులు తెలిపారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని స్థానిక మండల ఎంఈఓ 2 జి గెన్ను చెప్పారు. మండలంలోని సువ్వ తిలోగూడా స్కూల్ కాంప్లెక్స్ పరిధి ఉపాధ్యాయుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాశరథి, నాగేశ్వరావు, మురళీకృష్ణ, సిఆర్‌పి కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనిముట్లు అందిస్తున్న ఎఒ గిరిబాబు

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-జికెవీధి : మండలంలోని పెదవలస పంచాయతీ బంధావీధిలో గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాలకు వ్యవసాయ పనిముట్లు (కస్టమర్ హైరింగ్ సెంటర్) ఎఒ గిరిబాబు రైతులకు అందించారు. కార్యక్రమంలో పెదవలస పంచాయతీ అగ్రికల్చర్ అసిస్టెంట్ శంకర్ గిరిజన వికాస్ స్టాఫ్ పిసి యమున తదితరులు పాల్గొన్నారు.

స్థూపం పనులు పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తదితరులు

స్మారక స్థూపం పనుల పరిశీలన

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలో ఈనెల 23 వ తేదీన సిపిఎం సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ పూనెం సత్యనారా యణ మొదటి వర్ధంతి రేఖపల్లిలో జరగబోతోంది. ఈ సందర్భంగా రేఖపల్లి సెంటర్లో ఆయన స్మారక స్థూపం సిపిఎం ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. స్థూపం పనులను సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, పార్టీ మండల కార్యదర్శి పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, ఎంపిటిసి ప్రదీప్ కుమార్, మండల నాయకులు కమ్మ చిచ్చు సత్యనారాయణ, తుర్రం బాబురావు, గుండెపుడి లక్ష్మణరావుడి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో అద్దె బస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: అద్దెబస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ, వాల్తేర్ డిపో హైర్ బస్సు డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం సమ్మె చేపట్టారు. సమ్మె కారణంగా డిపోలోని 29 అద్దె బస్సులు నిలిచిపోయాయి. సమ్మెలో హైర్ బస్సు డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు 75 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్తేరు డిపో హైర్ బస్సు డ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ హైర్‌బస్ డ్రైవర్లకు జీతాలు పెంచాలని పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఆర్టిసి జిల్లా పాసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3 నెలల నుండి హైర్‌బస్ యజమానులకు, వాల్తేరు డిపో మేనేజర్, జిల్లా ఆర్ఎంకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదన్నారు. ఎపిఎస్ఆర్టీసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ మాట్లాడుతూ లేబర్‌యాక్ట్ ప్రకారంగా జీతాలు పెంపుదలతో పాటు అన్ని డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

చర్చలు ద్వారా సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలలో అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. వాల్తేరు డిపో అద్దె బస్సు డ్రైవర్ల అధ్యక్ష కార్యదర్శులు బి.జంపన్న, పి.రఘు, ఎపిఎస్ఆర్టీసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివ, కార్యదర్శి అర్జున్,అద్దె బస్సు డ్రైవర్లు, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రలో భాగస్వామ్యం కావాలి

సీలేరు: ఎస్ఇ సివిల్‌చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

అరకులోయలో శుభ్రం చేస్తున్న దొన్నుదొర

పాడేరులో మాట్లాడుతున్న పిఒ తిరుమణి శ్రీపూజ

ప్రజాశక్తి- విఆర్‌పురం: స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎంపిడిఒ ఇమ్మాన్యుయెల్ అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో సెక్రటరీ దుర్గాప్రసాద్ చేతులమీదుగా మొక్కలు నాటారు. తహశీల్దార్ సరస్వతి పాల్గొన్నారు. ప్రతి పంచాయతీ పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. తదుపరి ఎంపిడిఒ కార్యాలయం నుంచి రేఖపల్లి జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. రేఖపల్లి పిహెచ్‌సి ఆవరణలో డాక్టర్ స్వర్ణలత పిహెచ్‌సి సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు. కార్యక్రమం లో వివిధ పార్టీ నాయకులు, వెలుగు ఎపిఎం స్వామి, వి ఆర్‌పురం ఎస్సై సంతోష్‌కుమార్, ఎంఇఒ -2 బాబూరావు, ఆర్‌ఐ రామకృష్ణ, ఎంపిడిఒ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపిడిఒ లక్ష్మణరావు తెలిపారు. స్వచ్ఛఆంధ్రలో భాగంగా పంచాయతీ కార్యాలయం, నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ కొలుముల అక్కమ్మ, వైస్ ఎంపిపి కుంజం గంగాదేవి, కూటమి నాయకులు మాజీ ఎంపిపి తీగల ప్రభ, కుంజం సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: పుల్లంగి పంచాయతీ పుల్లంగి ఆశ్రమ పాఠశాలలో సర్పంచ్ జార్జిబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొయ్యూరు: కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల స్వచ్ఛాంధ్రలో భాగంగా పాఠశాల ఆవరణలో హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి చెత్తను తొలగించారు.

సీలేరు: జికెవీధి మండలం సీలేరులో ఎస్ఇ సివిల్‌చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇఇ రాజేంద్రప్రసాద్ ఇఇ భాస్కరరావు డిఇఇలు అప్పలనాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాయికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడేరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనా అధికారి ప్రసాద్, సూపరింటెండెంట్ లక్ష్మయ్య పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, అడిషనల్ కలెక్టర్ సాహిత్ మొక్కలు నాటారు. పాడేరు బస్‌స్టేషన్‌లో కమర్షియల్ సైట్ సమస్యను ఆర్టీసీ డిఎం శ్రీనివాసరావు ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకువచ్చారు. సాధ్యమైనంత త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పాడేరు టౌన్: స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర పరిశుభ్రమైన గాలి అనే అంశంపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించాలని ఇన్చార్జి జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ అన్నారు. పాడేరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుండి ఐటిడిఎ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ ఇన్చార్జి ఆర్‌డిఒ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: అరకులోయ స్వచ్ఛంగా ఉంటేనే పర్యాటకులను ఆకర్షించ వచ్చని టిడిపి అరకు ఇన్చార్జి, ఎపిఎస్ఆర్టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నాలుగు రోడ్డు జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ లోవరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బోరిబోరి లక్ష్మి, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంతల దేవదాస్, జనసేన అరకు ఇన్చార్జి చిరంజీవి,సమర్ధి రఘునాథ్, బీజేపీ నేత ఆనంద్, టిడిపి మండల అధ్యక్షుడు ఎల్ మహాదేవ్ పాల్గొన్నారు.

గంగవరం: మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ లక్ష్మణరావు, సర్పంచ్ అక్కమ్మ

అనంతగిరి: మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిపి శెట్టి నీలవేణి, ఎంపిడిఒ ప్రభాకర్, తహసిల్దార్ వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

'లోటస్' సేవలు అభినందనీయం

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: గత 18 సంవత్సరాలుగా లోటస్ హాస్పిటల్స్ అందిస్తున్న విశేష సేవలు అభినందనీయమని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ప్రశంసించారు. శనివారం విశాఖలో లోటస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నవజాత శిశువుల ఆత్మీయ, ఆరోగ్య సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వాణి హాజరై తల్లీ, పిల్లల వైద్య విభాగంలో లోటస్ హాస్పిటల్స్ చేస్తున్న సేవలను కొనియాడారు. హాస్పిటల్స్ డైరెక్టర్ కెవి కృష్ణ వర్ధన్ మాట్లాడుతూ విశాఖపట్నంలో గత సంవత్సర కాలంలో నూతన నవజాతి శిశువుల (అప్పుడే పుట్టిన పిల్లలు) విభాగంలో సుమారు 150 మందికి పైగా చిన్నారులకు విజయవంతంగా వైద్యసేవలు అందించి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ విభాగాన్ని మొట్టమొదటి నియోనాటాలజీ విభాగంలో డీఎం అర్హత సాధించి 25 సంవత్సరాల అనుభవం కలిగిన డాక్టర్ శేషగిరి ఎండీ (పీడియాట్రిక్స్), డిఎం (నియోనాటాలజీ) ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఎండీ (పీడియాట్రిక్స్) విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగస్వాములుగా నిలిచిన నర్సులను డాక్టర్ శేషగిరి బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ ఎం.శ్రీనివాస్,డాక్టర్ సిహెచ్. మాధురి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పిఎం సూర్యఘర్'పై అవగాహన కల్పించండి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి ప్రతి ఇంటిపై సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో జిల్లాలో 70 వేల యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పథకం పట్ల గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు,ఎస్‌హెచ్‌జి మహిళలు ప్రజలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. యూనిట్ల ఏర్పాటులో సహకరించిన గ్రామ, వార్డు కార్యదర్శులకు వెండర్‌ల ద్వారా ఇన్సెంటివ్ కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకానికి అందరూ అర్హులేనని కలెక్టర్ పేర్కొన్నారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు మాట్లాడుతూ ఒక కిలో వాట్‌కు రూ.65 వేలు ఖర్చు అవుతుందని, రూ.30 వేలు సబ్సిడీ ఉంటుందని, 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇంటిపైన కానీ, ఖాళీ ప్రదేశంలో గానీ 10 /10 అడుగుల స్థలం అవసరం ఉంటుందన్నారు. రెండు కిలోవాట్ల యూనిట్‌కు రూ.లక్షా 25వేల వరకూ ఖర్చు అవుతుందని, ప్రభుత్వం రూ.60 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. 240 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, లబ్ధిదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్తును 2 రూపాయల 9 పైసలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుం దని, 6 శాతం వడ్డీకి బ్యాంకు రుణాలు ఇస్తాయని,ప్రజలు ముందుకు వచ్చి దీని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి జిఎస్ డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ఉషారాణి, జోనల్ కమిషనర్లు,తహసీల్దార్లు, ఎంపిడివోలు,యు సి డి అధికారులు పాల్గొన్నారు.